ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ
అన్ని నియోజకవర్గాలలో విజ్ఞాన్ పత్రికకు విలేఖరులు కావలెను
ఫోన్ నెం. 99517 75293

VIGNAN PATRIKA

APTEL/2024/89102

# విజ్ఞాన్ పత్రిక

తెలుగు దినపత్రిక (Telugu Daily Paper)

సంపుటి : 02 సంచిక : 52 ఎడిటర్ : కలికి ఉదయ్ కుమార్ రెడ్డి శనివారం 21 మార్చి 2026 పేజీలు : 04 వెల : 02

## తీరు మారుస్తూ.. సుప్రీం 'తీర్పు'!

- తీర్పుల వెలువరింతలో హైకోర్టుల అసాధారణ జాప్యంపై ఆందోళన
- దేశంలోని అన్ని హైకోర్టులకు సర్వోన్నత న్యాయస్థానం కీలక ఆదేశాలు
- న్యాయాన్ని అందించడంలో జాప్యం జరిగితే.. అది న్యాయాన్ని తిరస్కరించడమే..!
- న్యాయం చేయడమే కాదు.. చేసినట్లు కూడా కనిపించాలి..!
- విప్లవాత్మక సంస్కరణ అంటున్న న్యాయ నిపుణులు
- ఇప్పటికే గడువు నిర్దేశించిన సుప్రీంకోర్టు.
- సుప్రీం.. తీవ్ర విస్మయం
- సుప్రీం ఆదేశాల అమలుకు రాష్ట్ర హైకోర్టు శ్రీకారం
- ఆ వివరాలన్నీ ప్రజలకు తెలియాల్సిన అవసరముంది..
- ఏడాదికి కూడా వెలువడని తీర్పులు
- న్యాయాన్ని అందించడంలో జాప్యం జరిగితే.. అది న్యాయాన్ని తిరస్కరించడమే..!



## ఎల్పీజీ సమస్య తలెత్తకుండా చూడాలి

- విద్యాసంస్థలు, ఆలయాలకు ప్రాధాన్యతమివ్వాలి: సీఎం చంద్రబాబు
- రాష్ట్రంలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష
- గ్యాస్ సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచన
- ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్‌జీ, ఈవీ, ఇతర మార్గాలపై దృష్టి పెట్టాలని వెల్లడి
- ఎల్పీజీ సరఫరాపై కేంద్రంతో మాట్లాడాం
- రాష్ట్రంలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దని సీఎం చంద్రబాబు స్పష్టం
- రాన్ -- ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్నాళ్లు యుద్ధం కొనసాగితే ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం
- సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్ధేశం
- పెట్రోల్, డీజిల్ పై అధికారులను అప్రమత్తం చేసిన సీఎం చంద్రబాబు

రాష్ట్రంలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## శాంతిదూత డొనాల్డ్ ట్రంప్!



**జపాన్ ప్రధాని తకాయిచి ప్రశంస**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై జపాన్ మహిళా ప్రధాని సనే తకాయిచి ప్రశంసల వర్షం కురిపించారు. ప్రపంచంలో శాంతిని నెలకొల్పే సామర్థ్యం ఆయనకు ఉందని చెప్పారు. ట్రంప్‌ను శాంతిదూతగా అభివరి?ఇంచారు.

## 'బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు'

- టి ఎం సి మేనిఫెస్టోను విడుదల చేసిన మమతా బెనర్జీ
- సంతోషపు వెలుగులు ప్రతీ ఇంటికి చేరాలి!
- బంగాల్‌లో అనధికారిక రాష్ట్రపతి పాలన
- 10 లక్షల మంది పేర్లు ఓటర్ల జాబితాల నుంచి తొలగింపు
- బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా 'పునర్విభజన'
- సీఎం లెటర్ హెడ్‌ను వాడినందుకు మమతపై చర్యలు తీసుకోవాలి : సువేందు
- ఈసీకి సువేందు ప్రశ్నలు



బంగాల్ అసెంబ్లీ ఎన్నికల కోసం తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పార్టీ మేనిఫెస్టోను సీఎం మమతా బెనర్జీ విడుదల చేశారు. 'బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు' శీర్షికన ఈ మేనిఫెస్టో బుక్‌లెట్‌ను రూపొందించారు. ఈసందర్భంగా శుక్రవారం కోల్‌కతాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ మేనిఫెస్టో ప్రజా కేంద్రకంగా ఉంటుందని ప్రకటించారు. బంగాల్‌లోకి కేంద్ర ప్రభుత్వ జోక్యాన్ని అడ్డుకోవడం, బంగాల్ ఉనికిని కాపాడటం తమ పార్టీ లక్ష్యాలని ఆమె వెల్లడించారు. బంగాల్ ఎన్నికల తర్వాత నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజెన్స్ (ఎన్‌ఆర్‌సీ), జన గణన పేర్లతో ప్రజల పౌరసత్వాలను లాక్కునే యత్నాన్ని కేంద్ర ప్రభుత్వం చేస్తుందని దీదీ ఆరోపించారు. ఇలాంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రజలను ఆమె కోరారు.

## ఇరానియన్ల పట్టుదల భేష్?

- శత్రువులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు: మొజ్తబా ఖమేనీ
- నాటో మిత్రదేశాలపై ట్రంప్ ఘాటు విమర్శలు
- ఇరాన్ యుద్ధంలో చేరనందుకు నాటో మిత్రదేశాలపై ట్రంప్ విమర్శలు
- పిరికివాళ్లను గుర్తుపెట్టుకుంటామంటూ హెచ్చరించిన ట్రంప్
- హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు నాటో దేశాలు రాకపోవడంపై ట్రంప్ అసహనం
- హోర్ముజ్ జలసంధి తెరిపించేందుకు సైనిక సహాయం కోరిన ట్రంప్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ డిమాండ్‌ను పట్టించుకోని నాటో దేశాలు

ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంచలన ప్రకటన చేశారు. పర్షియన్ నూతన సంవత్సరం "నౌరూజ్" సందర్భంగా విడుదల చేసిన రాతపూర్వక సందేశంలో "శత్రువు ఓడిపోయిందంటూ.." ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అమెరికా--ఇజ్రాయెల్ దాడుల మధ్య ఇరాన్ ప్రజలు ఐక్యతను ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు.

## గ్యారంటీలకు ఘోరీ

- సీఎం, డిప్యూటీ సీఎంలపై హరీశ్‌రావు ఫైర్
- ఇది ప్రజలను నిరాశపరిచే బడ్జెట్
- వృద్ధాప్య, దివ్యాంగుల పింఛన్ల పెంపు ఊసే లేదు
- మహిళలకు ఇస్తామన్న రూ.2,500, నిరుద్యోగ భృతి
- రూ.4 వేల ప్రస్తావనే లేదు
- 20 పేజీలు, రూ.20 వేల కోట్లు పెంచారు
- 'తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ పేరిట, హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా మూడు ముక్కలు చేశారు
- క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్, గోల్ మాల్ మోడల్ అన్న బీఆర్ఎస్ నేత



## రేషన్‌కార్డు ఉంటేనే కుటుంబ బీమా

- మూసీ ప్రక్షాళన తప్ప ప్రత్యామ్నాయం లేదు
- దేశస్థాయి ప్రమాణాలతో 10౦2 పద్ధతిలో విద్యా విధానం
- మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు యథాతథమే
- మండలాలు, జిల్లాల పునర్వ్యవస్థీకరణ ఇప్పట్లో లేదు
- అజహరుద్దీన్, కోదండరాం ఎమ్మెల్సీల ఫైల్ గవర్నర్ పరిశీలనలో
- చట్ట ప్రకారమే ఫార్ములా-ఈ, ఫోన్ ట్యాపింగ్ విచారణ
- రూ. 3.47 లక్షల కోట్లు అప్పులు తెచ్చాను..
- అందులో రూ. 3.30 లక్షల కోట్లు అప్పులు కట్టేందుకే
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



## రాజకీయ ప్రకటనలకు ప్రీ-సర్టిఫికేషన్ తప్పనిసరి

- అసెంబ్లీ ఎన్నికల వేళ ఈసీ కీలక నిర్ణయం
- కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ఆమోదం తప్పనిసరని ప్రకటన రిలీజ్

# గ్యారంటీలకు ఘోరీ

న్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘోరీ కట్టారని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉప నేత హరీశ్‌రావు విమర్శించారు. ఇది దగాకోరు, ప్రజలను తీవ్రంగా నిరాశపరిచే బడ్జెట్ అని అన్నారు. వృద్ధాప్య, దివ్యాంగుల పింఛను పెంపు ఊసే లేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ప్రస్తావన కానీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.4 వేల గురించిన కనీస ఊసు కానీ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీల్లో కొన్ని అమలు చేస్తూ అందులోనూ గత బడ్జెట్‌తో పోలిస్తే కోతలు పెట్టారన్నారు. ఆరు గ్యారంటీల విషయంలో గతేడాది రూ.56 వేల కోట్లు పెడితే, ఈ బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లకు కుదించారని పేర్కొన్నారు. కొత్త పింఛన్లు కాదు ఉన్న పింఛన్లు ఊడగొడుతున్నారని ధ్వజమెత్తారు. 3 లక్షల పింఛన్లు తొలగించి, 2 లక్షల కొత్త పింఛన్లు ఇస్తామంటున్నారని విమర్శించారు. 18 ఏళ్లు పైబడిన విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. శుక్రవారం ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, కేపీ వివేకానంద, సంజయ్, పల్లా రాజేశ్వరరెడ్డి, చింతా ప్రభాకర్‌లతో కలిసి హరీశ్‌రావు విలేకరులతో మాట్లాడారు.

20 పేజీలు, రూ.20 వేల కోట్లు పెంచారు

'బడ్జెట్ ప్రసంగాన్ని 20 పేజీలు, బడ్జెట్‌ను రూ.20 వేల కోట్లు పెంచారే తప్ప.. ఆరు గ్యారెంటీల ఊసెత్తలేదు. నిధుల కేటాయింపు చేయలేదు. కాగితాల మీద అంకెలు ఉన్నాయి తప్ప.. ప్రజల కష్టాలు తీర్చడంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గత బడ్జెట్‌లో చెప్పిన పథకాలు అమలు చేయలేదు. మళ్లీ అవే పథకాలు వల్లవేశారు. గత బడ్జెట్‌లోనే రాజీవ్ యువ వికాసం పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయించారు కానీ పైసా విడుదల చేయలేదు. మళ్లీ ఈసారి బడ్జెట్‌లో అంతే మొత్తాన్ని ప్రతిపాదించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలోనూ అదే జరిగింది. ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీల పేర్లు చెప్పివారి ఆత్మ క్షోభించేలా చేస్తున్నారు..'అని హరీశ్‌రావు విమర్శించారు.

మూడు ముక్కలు చేయడం తప్ప..

'తెలంగాణను క్యూర్, ప్యూర్, రేర్ పేరిట, హైదరాబాద్ కార్పొరేషన్‌ను మూడు కార్పొరేషన్లుగా మూడు ముక్కలు చేయడం తప్ప చేసిందేమీ లేదు. క్యూర్, ప్యూర్, రేర్ కాదు.. చోర్ మోడల్, గోల్‌మాల్ మోడల్. బడ్జెట్ అంతా బోగస్. అభయహస్తం కాదు రిక్త హస్తమని ప్రజలకు అర్థమైంది. పింఛన్ల పెంపు ఎప్పుడా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. పదవీ విరమణ ఉద్యోగులకు ప్రయోజనాలు లేవు. అన్ని కులాలకు, వర్గాలకు మొండిచేయి చూపారు.

# రేషన్‌కార్డు ఉంటేనే కుటుంబ బీమా

కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో నాకెలా తెలుస్తుంది. కొడుకు, కూతురు, అల్లుడు కలిసి గృహ నిర్బంధం చేశారేమో.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అసెంబ్లీకి చెవుల్లో పువ్వులు పెట్టుకొని రావడం కాదు. వారిని వంగోబెట్టి వీపు మీద బండపెట్టాలి. ఊళ్లలో తప్పులు చేసినోళ్లకు బంజరుదొడ్డి కాడ అట్లనే చేసేవారు'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో ఏ పదవిని ఎవరైనా అడగొచ్చని, మల్లికార్జునఖర్గే బ్లాక్ ప్రెసిడెంట్ నుంచి ఏఐసీసీ ప్రెసిడెంట్‌కు ఎదిగారని గుర్తు చేశారు. చిన్న పిల్లలను పెద్దయ్యాక ఏమవుతావని అడిగితే ఐఏఎస్, ఐపీఎస్ అవుతానని చెబుతారని, అలాగే తాను సీఎంగా ఉన్నాను కాబట్టి, మళ్లీ వచ్చేసారి కూడా తానే సీఎంనని చెప్పినట్టు తెలిపారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత సీఎల్పీ సమావేశంలో మెజారిటీ ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకే సీఎంను ఎన్నుకుంటారని స్పష్టం చేశారు. శుక్రవారం శాసనమండలి కమిటీ హాల్‌లో ఆయన మీడియాతో 'చిట్‌చాట్'చేశారు.

**పనోడిలా కేంద్రం నుంచి నిధులు తెప్పిస్తున్నా..:** సీఎంగా కేంద్రం నుంచి నిధులు తేవడం కూడా ఓ పనే. నేను పాలకుడిని కాదు. సేవకుడిని. ప్రజలు ఐదేళ్ల కోసం ఓ పనోణ్ణి పెట్టుకున్నారు. గతంలో బాగా పనిచేస్తాడని పెట్టుకున్నాయన ఫాంహౌస్‌ల పడుకున్నందుకు ఆయన్ను మార్చారు. ఢిల్లీలో సీఎంకు కేంద్ర ప్రభుత్వం బంగ్లా ఎందుకిస్తుంది? గతంలో ఢిల్లీకి వెళ్లి రావాల్సిన నిధులు కూడా తెచ్చుకోలేదు. ఇప్పుడు అందుకు భిన్నంగా కేంద్ర ప్రాయోజిత పథకాల మీద దృష్టి పెట్టి సాధించుకుంటున్నాం. డీపీఆర్ సబి?మట్ చేస్తే కేంద్రం 25 శాతం నిధులు ఇస్తది. మూసీకి కేంద్రం ఆమోదం తెలపలేదని ఎవరన్నారు? కేంద్రం ఆమోదం తెలిపితేనే మూసీనది ప్రక్షాళనకు ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంక్ రుణానికి ఒప్పుకుంది.

**మూసీ ప్రక్షాళన ఆగదు:** మూసీనది ప్రక్షాళన ఆగదు. మూసీ బఫర్‌జోన్‌లో అటు ఇటు 50 మీటర్ల చొప్పున తీసుకొని అభివృద్ధి చేయాలి. 55 కిలోమీటర్ల మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులో డిసెంబర్ 2024లో కన్సల్టెన్సీని అపాయింట్ చేస్తే 21 కిలోమీటర్లకు సంబంధించి లంగర్‌హౌస్ వరకు డీపీఆర్ రిపోర్టు ఇచ్చింది. అభివృద్ధి చేసే క్రమంలో ప్రజలకు జరిగే నష్టాన్ని ఎలా పూడ్చాలనేది చూడాలి. ఈ విషయంలో సూచనలు, సలహాలు ఇవ్వమని అడిగినం. పబ్లిక్ డొమైన్‌లో పెట్టినం.

**రేషన్‌కార్డు ఉంటేనే :** రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు బీమా కల్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. అయితే రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకే రూ.5 లక్షల కుటుంబబీమా అమలు చేస్తాం. ప్రస్తుతం వ్యవసాయ భూమి కలిగిన రైతులకు కల్పిస్తున్న రూ.5 లక్షల బీమా సదుపాయాన్ని రేషన్‌కార్డు కలిగిన కుటుంబాలకు ఇస్తాం. అప్పుడు రైతుబీమా కూడా అందులోకే వస్తుంది. కుటుంబ ఆర్థిక స్తోమత నిర్ధారణకు రేషన్‌కార్డు ఒక్కటే కొలమానం.

**తెలంగాణ విద్యావిధానంలో సంస్కరణలు :** తెలంగాణ విద్యావిధానంలో మార్పులు తీసుకొస్తున్నాం. అందుకోసం దేశవ్యాప్తంగా అమలవుతున్న 10 ప్లస్ 2 విధానాన్ని తీసుకురావాల్సిన అవసరముంది. ఈ మేరకు విద్యాకమిషన్ ఇచ్చిన నివేదికను కె.కేశవరావు నేతృత్వంలోని ఓ కమిటీకి అప్పగించాం. ఈ కమిటీకి అభ్యంతరాలు, సూచనలు ఇస్తే, తుది నివేదిక ఇస్తుంది. దాన్ని అమలు చేసే బాధ్యత నాది.

# నేను వున్నాను సీఎం భరోసా

ఉద్యాన పంటల నష్టం విలువ రూ. 23 కోట్లుగా అంచనా వేశారు. ఇప్పటివరకు వేసిన అంచనాల ప్రకారం అన్ని పంటలకు కలిపి మొత్తం నష్టం రూ.63 కోట్లుగా అధికారులు లెక్క తేల్చారు. పూర్తి స్థాయి నష్టం అంచనాలను సోమవారంకల్లా సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు.

**ఉద్యాన పంటలకు నష్టం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంగళ, బుధవారాల్లో కురిసిన వడగండ్ల వర్షానికి గాలి తోడవడంతో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అనంతపురం జిల్లాలో 63 ఎకరాల్లో, శ్రీసత్యసాయి జిల్లాలో 405 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల అరటి నేలకొరిగింది. శ్రీసత్యసాయి జిల్లాలో 245 ఎకరాల్లో మామిడి పిందె రాలింది. చీనీ 75 ఎకరాలు, అరటి 94, మునగ 32 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అధికారుల ప్రాథమికంగా అంచనా వేశారు.

**వేల ఎకరాల్లో పంట నష్టం:** నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలంలో కురిసిన వడగండ్ల వాన రైతులను నిలువునా ముంచింది. వరి, పత్తి, ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మండలంలోని కొన్ని గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి సుమారు 2300 ఎకరాల్లో వరి, 350 ఎకరాల్లో పత్తి పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. పంట చేతికి వచ్చే సమయానికి అకాల వర్షం రావడంతో పూర్తిగా నష్టపోయామని అన్నదాతలు కంటతడి పెట్టుకున్నారు. ప్రభుత్వమే తమకు ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఉండవల్లి సీఎం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్పీజీ సరఫరాపై సమీక్షించారు. ఇరాన్ -- ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్నాళ్లు యుద్ధం కొనసాగితే ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే అవకాశం ఉందని, ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్ధవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని అధికారులకు చంద్రబాబు దిశానిర్ధేశం చేశారు. ఎక్కడా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలని సూచించారు. గ్రామీణ – గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ డెలివరీలో ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు.

**ఎల్పీజీ సరఫరాపై కేంద్రంతో మాట్లాడాం:** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సరఫరా, కొరతపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తున్నారని, ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్ కింద గ్యాస్‌ను చేర్చిన తర్వాత బుకింగ్స్ ఒక్కసారిగా పెరిగాయని ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా 3.54 లక్షల బుకింగ్స్ నమోదు కాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 2.96 లక్షలకు తగ్గిందని ప్రజల్లో అవగాహన పెరుగుతోందని అన్నారు. ప్రస్తుతం బుక్ చేసుకున్న 2.96 లక్షల మందిలో ఇప్పటికే 2.72 లక్షల మందికి గ్యాస్ డెలివరీ పూర్తయిందని తెలిపారు. హార్మూజ్ జలసంధి వద్ద యుద్ధ ఉద్రిక్తతల వల్ల విశాఖపట్నానికి ఈ నెల 21న రావాల్సిన గ్యాస్ నౌక, 26వ తేదీన చేరుకోనుందని కేంద్రం సమాచారం ఇచ్చిందన్నారు. అప్పటి వరకు ఎటువంటి అంతరాయం లేకుండా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. భవిష్యత్తులో ఈ తరహా సంక్షోభాలు ఎదుర్కోవడానికి పైప్డ్ నేచురల్ గ్యాస్ వాడకం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పట్టణ ప్రాంతాల్లో సిలిండర్ల నుంచి పీఎన్జీకి మారేలా కొత్త పాలసీని సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. సుమారు 2.60 లక్షల మందికి తక్షణమే ఈ కనెక్షన్లు ఇచ్చేలా నివేదిక సిద్ధమవుతోందన్నారు. రాష్ట్రంలో 12 ఏళ్ల క్రితమే కిరోసిన్ సరఫరా నిలిపివేసినప్పటికీ, ప్రస్తుత గ్యాస్ కష్టాల దృష్ట్యా కేంద్రం 2800 కిలో లీటర్ల కిరోసిన్‌ను కేటాయించిందని వచ్చే సోమవారం నుంచి గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో లీటరు చొప్పున కిరోసిన్ పంపిణీ చేయాలని భావిస్తున్నామని తెలిపారు. గ్యాస్ సిలిండర్లను దారిమళ్లించే ఏజెన్సీలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని ఇప్పటికే నిబంధనలు ఉల్లంఘించిన 9 ఏజెన్సీలపై చర్యలు తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు. డొమెస్టిక్ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు వాడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రస్తుతం పరీక్షల సమయం కావడంతో విద్యా సంస్థలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, అన్న క్యాంటీన్లకు గ్యాస్ సరఫరాలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్లకు ఎస్వోపీ జారీ చేశామని మంత్రి నాదెండ్ల అన్నారు.

# తీరు మారుస్తూ.. సుప్రీం 'తీర్పు'!

- **న్యాయం చేయడమే కాదు.. చేసినట్లు కూడా కనిపించాలి..!**

ఇవి న్యాయ వ్యవస్థలో రూఢీ అయిన సూత్రాలు. అయితే కక్షిదారులకు న్యాయం అందించే విషయంలో దేశంలోని హైకోర్టుల్లో పరిస్థితులు భిన్నంగా ఉండటంపై స్వయంగా సుప్రీంకోర్టు రంగంలోకి దిగింది. హైకోర్టుల్లో వాదనలు విని తీర్పును రిజర్వ్ చేసిన నాటి నుంచి తీర్పు వెలువరించేంత వరకు జరుగుతున్న అసాధారణ జాప్యాన్ని నివారించేందుకు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా తీర్పులను వెలువరించేందుకు నిర్దిష్ట గడువు నిర్దేశిస్తూ ఇటీవల కీలక ఆదేశాలు ఇచ్చిన సుప్రీంకోర్టు తాజాగా దేశంలోని అన్ని హైకోర్టులకు అత్యంత కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇకపై ఏదైనా కేసులో వాదనలు విన్న తరువాత ఆ కేసులో తీర్పును ఎప్పుడు రిజర్వ్ చేశారు..? ఆ తరువాత తీర్పును ఎప్పుడు వెలువరించారు..? ఆ తీర్పు కాపీని ఎప్పుడు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు..? అనే వివరాలను తేదీలతో సహా తీర్పు కాపీపై స్పష్టంగా ముద్రించాలని అన్ని హైకోర్టులను సుప్రీంకోర్టు ఆదేశించింది. తద్వారా ఆ కేసులో ఎప్పుడు ఏం జరిగిందని అందరూ తెలుసుకునే అవకాశం ఉంటుంది. అలాగే తీర్పులు వెలువరించే విషయంలో వేగం కూడా పెరగనుంది.

**విప్లవాత్మక సంస్కరణ అంటున్న న్యాయ నిపుణులు..**

సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ కీలక ఆదేశాలను న్యాయవ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణగా న్యాయ నిపుణులు అభివర్ణిస్తున్నారు. దీనివల్ల న్యాయియుువ్యవస్థలో పారదర్శకత, తీర్పులు ఇచ్చే విషయంలో జవాబుదారీతనం పెరుగుతుందని పేర్కొంటున్నారు. సుప్రీంకోర్టు తాజా ఆదేశాల నేపథ్యంలో ఇకపై సుదీర్ఘ కాలం పాటు తీర్పు వెలువరించకుండా ఉండేందుకు అవకాశం ఉండదు. ఒకవేళ అలా సుదీర్ఘ కాలం పాటు తీర్పు వెలువరించకుంటే.. చివరకు తీర్పు వెలువరించిన సమయంలో ఆ వివరాలను అందులో ప్రస్తావించాల్సి ఉంటుంది. దీంతో జాప్యంపై ఎవరో ఒకరు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. వాస్తవానికి తీర్పు వెలువరించే విషయంలో న్యాయమూర్తులకు చట్టపరంగా నిర్దిష్ట గడువంటూ ఏదీ లేదు. అయితే తీర్పు రిజర్వ్ చేసిన తర్వాత ఆరు నెలల్లోపు తీర్పు వెలువడటం ఓ సంప్రదాయంగా వస్తోంది. వాస్తవానికి 2001లో అనిల్‌రాయ్ కేసులో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన తీర్పునిచ్చింది. తీర్పు రిజర్వ్ చేసిన తేదీ నుంచి మూడు నెలల్లో తీర్పు వెలువరించాలని ఆ తీర్పులో సుప్రీంకోర్టు అన్నీ హైకోర్టులను ఆదేశించింది.

**ఇప్పటికే గడువు నిర్దేశించిన సుప్రీంకోర్టు**

అలాగే కొన్ని హైకోర్టుల్లో తీర్పులు వెలువరించిన తరువాత అవి అందుబాటులోకి రావడంలో అసాధారణ జాప్యం జరుగుతోంది. కొన్నిసార్లు తీర్పు కాపీలు బయటకు వచ్చేందుకు నెలల సమయం కూడా పడుతోంది. దీంతో కక్షిదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. తీర్పు కాపీ అందుబాటులోకి రాకపోవడంతో సానుకూల ఉత్తర్వులు పొందినప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. ఈ నేపథ్యంలో తీర్పులు వెలువరించే విషయంలో నిర్దిష్ట గడువు నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఇటీవల ఓ తీర్పునిచ్చింది. ఏదైనా కేసులో తీర్పు రిజర్వ్ చేసిన తరువాత 3 నెలల్లోపు తీర్పు వెలువరించకుంటే ఈ విషయాన్ని సంబంధిత హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్.. ప్రధాన న్యాయమూర్తి (సీజే) దృష్టికి తేవాలని ఆదేశించింది. అనంతరం సీజే.. ఆ విషయాన్ని సదరు న్యాయమూర్తి, ధర్మాసనం దృష్టికి తెచ్చి రెండు వారాల్లో తీర్పునివ్వాల్సిందిగా కోరాలని సూచించింది. ఆ రెండు వారాల్లో కూడా తీర్పు వెలువరించకుంటే, ప్రధాన న్యాయమూర్తి ఆ కేసును మరో న్యాయమూర్తికి, ధర్మాసనానికి నివేదించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గడువు లోపు తీర్పు వెలువరించకుంటే సంబంధిత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఏం చేయాలి, కక్షిదారులు ఏం చేయాలన్న దానిని ధర్మాసనం తన తీర్పులో స్పష్టంగా పేర్కొంది.

**సుప్రీం.. తీవ్ర విస్మయం**

తమకు కింది కోర్టు విధించిన శిక్షను సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీళ్లపై తీర్పును రిజర్వ్ చేసిన జార్ఖండ్ హైకోర్టు రెండు మూడేళ్ళుగా తీర్పు వెలువరించలేదంటూ కొందరు ఖైదీలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ ధర్మాసనం విచారణ జరిపింది. తీర్పు రిజర్వు చేసి రెండేళ్లయినా కూడా తీర్పు వెలువరించకపోవడంపై ధర్మాసనం తీవ్ర విస్మయాన్ని వ్యక్తం చేస్తూ దేశంలోని అన్ని హైకోర్టుల నుంచి నివేదికలు కోరింది. తీర్పులు వెలువరించడంలో జాప్యం చేయడం కక్షిదారుల హక్కులను హరించడమేనని అభిప్రాయపడ్డ ధర్మాసనం.. హైకోర్టులకు తగిన దిశా నిర్దేశం చేయాలని నిర్ణయించింది. తమ ముందున్న కేసుల్లో తీర్పులు వెలువరించేందుకు ఎంత కాలం పడుతుందో ప్రజలందరికీ తెలియచేసేందుకు వీలుగా ఆ వివరాలను తీర్పు కాపీలో స్పష్టంగా పేర్కొనాలని అన్ని హైకోర్టులను ఆదేశించింది. న్యాయవ్యవస్థలో పారదర్శకత, సంస్కరణలు కేవలం కాగితాలకే మాత్రమే పరిమితం కాకూడదని, ప్రజలు న్యాయ వ్యవస్థపై నమ్మకం ఉంచేలా ఆ సంస్కరణలు ఉండాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

**సుప్రీం ఆదేశాల అమలుకు రాష్ట్ర హైకోర్టు శ్రీకారం..**

సుప్రీంకోర్టు ఆదేశాల అమలుకు ఏపీ హైకోర్టు చర్యలు చేపట్టింది. ప్రతి తీర్పు సర్టిఫైడ్ కాపీతో పాటు అప్‌లోడ్ చేసిన కాపీలోనూ తీర్పును ఎప్పుడు రిజర్వ్ చేశారు.. ఎప్పుడు తీర్పు వెలువరించారు.. ఎప్పుడు ఆ తీర్పును అప్‌లోడ్ చేశారు.. లాంటి వివరాలను తీర్పు మొదటి పేజీలో స్పష్టంగా పేర్కొనాలని హైకోర్టు రిజిస్ట్రీ ఆదేశించింది. అందుకు అనుగుణంగా న్యాయమూర్తుల కోర్టు మాస్టర్లు, పర్సనల్ సెక్రటరీలు చర్యలు చేపట్టారు. దీంతో తీర్పులు సకాలంలో అప్‌లోడ్ అవుతూ కక్షిదారులకు అందుబాటులోకి వస్తున్నాయి.

**ఆ వివరాలన్నీ ప్రజలకు తెలియాల్సిన అవసరముంది..**

'ఏ న్యాయమూర్తి ఎప్పుడు తీర్పు రిజర్వ్ చేశారు? ఎంత కాలం తర్వాత తీర్పు ఇచ్చారు? ఆ తీర్పు కక్షిదారులకు ఎప్పుడు అందుబాటులోకి వచ్చింది? తీర్పులను వెబ్‌సైట్లలో అప్‌లోడ్ చేయడానికి హైకోర్టులు ఎంత సమయం తీసుకుంటున్నాయి? లాంటి వివరాలన్నీ ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ స్పష్టంగా పేర్కొన్నారు. తీర్పుల రిజర్వ్, తీర్పు వెలువడిన తేదీలను మాత్రమే చూపే ఒక ప్రత్యేక డాష్‌బోర్డ్ హైకోర్టు వెబ్‌సైట్లలో ఉండాలని జస్టిస్ బాగ్చీ అభిప్రాయపడ్డారు.

**ఏడాదికి కూడా వెలువడని తీర్పులు**

అయితే ఈ ఆదేశాలు పలు హైకోర్టుల్లో అమలు కావడం లేదు. వాదనలు విని తీర్పు రిజర్వ్ చేసిన తరువాత ఏడాదికి కూడా తీర్పులు వెలువరించని పలు ఉదంతాలు ఇటీవల సుప్రీంకోర్టు దృష్టికి వచ్చాయి. కొన్ని హైకోర్టులు తీర్పు రిజర్వ్ చేసిన రెండేళ్లకు కూడా తీర్పులు వెలువరించకపోవడంపై తీవ్ర విస్మయం వ్యక్తం చేసింది. దీనిపై ఇటీవల దేశవ్యాప్తంగా పెద్ద చర్చ కూడా జరిగింది. తీర్పులు వెలువరించడంలో అసాధారణ జాప్యం చేసినందుకు కొందరు న్యాయమూర్తులను సైతం సుప్రీంకోర్టు బదిలీ చేసింది. దక్షిణాదిలోని ఓ హైకోర్టులో న్యాయమూర్తి ఒకరు దాదాపు 700 కేసుల్లో ఏడాదికి కూడా తీర్పులు వెలువరించని కారణంతో సుప్రీంకోర్టు ఆయన్ను బదిలీ చేసింది. సకాలంలో తీర్పులు వెలువరించాలన్న విషయంలో సుప్రీంకోర్టు వైఖరి చాలా స్పష్టంగా ఉంది.

# ఇరానియన్ల పట్టుదల భేష్?

తన తండ్రి, ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతి తర్వాత మొజ్తబా ఖమేనీ మొదటిసారి ప్రజలకు రాతపూర్వక సందేశాన్ని విడుదల చేశారు. ఈ సందేశంలో ఖమేనీ ఇలా రాసుకొచ్చారు. మతపరమైన, సాంస్కృతిక, రాజకీయ భిన్నతలు ఉన్నప్పటికీ ప్రజలు ఒకటిగా నిలిచారు. ఈ ఐక్యత వల్లే శత్రువు ఓటమి చెందిందని పేర్కొన్నారు. అమెరికా--ఇజ్రాయెల్ దాడులతో ఇరాన్ ప్రజలను భయపెట్టి ప్రభుత్వాన్ని కూలదోయాలని భావించారు. ఇది వారు చేసిన భారీ తప్పిదమని త్వరలోనే తెలుసుకుంటారు. శత్రువులు ఇరాన్ నాయకత్వాన్ని హతమార్చడం ద్వారా ప్రజల్లో భయం, నిరాశ కలిగించి దేశాన్ని విభజించాలనుకున్నారు. ఇలా జరగకపోగా, శత్రువులలోనే విభేదాలు పుట్టాయి. ప్రాంతీయ పరిణామాలపై కూడా ఆయన స్పందించారు. టర్కీ, ఒమాన్‌పై జరిగిన దాడులకు ఇరాన్ బలగాలు బాధ్యులు కాదని తెలిపారు. అవి ఫాల్స్ ఫ్లాగ్ చర్యలు అని, పొరుగు దేశాల మధ్య విభేదాలు సృష్టించడమే శత్రువుల లక్ష్యమని అన్నారు. ఆఫ్ఘనిస్తాన్--పాకిస్తాన్ మధ్య జరుగుతున్న ఘర్షణలపై కూడా ఖమేనీ స్పందించారు. ఇరు దేశాల మధ్య సయోధ్యకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆఫ్ఘనిస్తాన్-పాక్ సోదరుల్లా మెలగాలని.. ముస్లింలు ఐక్యతతో ఉండాలని పిలుపునిచ్చారు. కాగా, ఈద్ అల్-ఫితర్ సందర్భంగా ఆఫ్ఘనిస్తాన్-పాక్ తాత్కాలికంగా యుద్ధ విరమణకు అంగీకరించిన విషయం తెలిసిందే.

# శాంతిదూత డొనాల్డ్ ట్రంప్!

హార్మూజ్ జలసంధిలో చమురు నౌకల రక్షణకు యుద్ధ నౌకలను పంపించడానికి జపాన్ ముందుకు రాలేదంటూ రుసరుసలాడుతున్న ట్రంప్ ఆగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రయతి?ంచారు. అమెరికా అధ్యక్షుడితో సంబంధాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామంటూ సంకేతాలిచ్చారు. తకాయిచి గురువారం వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. పశ్చిమాసియా యుద్ధంపై వారు చర్చించుకున్నట్లు సమాచారం. ఇరాన్ అణ్వస్త్ర కార్యక్రమాలు చేపట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తకాయిచి స్పష్టంచేశారు. తకాయిచి నాయకత్వాన్ని ట్రంప్ కొనియాడారు. ఆమె బహుళ ప్రజాదరణ కలిగిన శక్తివంతురాలైన నేత అంటూ ప్రశంసించారు. ఇరాన్‌పై యుద్ధంలో అమెరికాకు జపాన్ అందించే సాయంపై వారు మాట్లాడుకున్నట్లు తెలుస్తోంది. ఈ యుద్ధంలో జపాన్ సహకారాన్ని ట్రంప్ కోరుతున్నారు. షెడ్యూల్ ప్రకారం డొనాల్డ్ ట్రంప్ త్వరలో చైనాలో పర్యటించబోతున్నారు. ఈ పర్యటనకు ముందుకు ఆయన జపాన్ ప్రధానమంత్రితో సమావేశం కావడం చర్చనీయాంశంగా మారింది.

# 'బంగాల్ ప్రజలకు దీదీ 10 హామీలు'

**సంతోషపు వెలుగులు ప్రతీ ఇంటికి చేరాలి!**

"నేను బంగాల్ ప్రజలకు 10 హామీలను ఇస్తున్నాను. తప్పకుండా వీటిని రాబోయే ఐదేళ్ల పాటు అమలు చేస్తాను. రాష్ట్రంలోని గడపగడపకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ సేవలను చేరుస్తాను. ఇందుకోసం ప్రతీ బ్లాక్ పరిధిలో దువారే చికిత్సా క్యాంపులను ఏర్పాటు చేస్తాం. బంగాల్ రాష్ట్ర అభివృద్ధి చక్రాలు ఎలాంటి అంతరాయం లేకుండా తిరిగేందుకు దోహదం చేసేలా మా మేనిఫెస్టోను రూపొందించాం. సంతోషపు వెలుగులు బంగాల్‌లోని ప్రతీ ఇంటికి చేరాలి అనేది మా లక్ష్యం" అని ఈసందర్భంగా విలేకరుల సమావేశంలో సీఎం మమతా బెనర్జీ తెలిపారు.

## మున్సిపల్ ప్రత్యేక అధికారిగా ఆర్డీవో వి.పావని బాధ్యతలు స్వీకరణ



మున్సిపాలిటీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ఆత్మకూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఆత్మకూరు ఆర్డీవో బి.పావని శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు మేరకు ఆత్మకూరు ఆర్డీవో బి.పావనికి ఆత్మకూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా నియమించారు.. దీంతో నేడు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారినిగా బి.పావని బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్ మరియు ఇతర సిబ్బందితో మున్సిపాలిటీ పరిపాలన వ్యవహారాలపై చర్చించారు..ముఖ్యంగా పట్టణంలో పారిశుద్ధ నిర్మూలనపై త్రాగునీటి సమస్యపై ఆర్డిఓ బి.పావని ప్రత్యేకంగా చర్చించి పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడవలసిందిగా పలు సూచనలు చేశారు..

## నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఎక్కడ ఉన్నాయో కొంచెం చూపించండి సార్

**విజ్ఞాన పత్రిక పొదలకూరు ::**



నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలో పొదలకూరు మండలంలోని నేదురు మల్లి గ్రామము మరియు మరుపూరు గ్రామాలలో ఇళ్ల స్థలాలు లేని కుటుంబాలు ఇచ్చిన ఇళ్ల స్థలాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గ్రామాలలో ఉండే నాయకులు వైసిపి ప్రభుత్వం వారు ఇచ్చిన ఇళ్ల స్థలాలను గ్రామంలో ఉండే అధికార పార్టీ నాయకులు హద్దురాలను తొలగించి ఆ పొలాలను చదును చేసుకుని సాగు చేసుకుంటున్నారు అధికారులకు చెప్పుకున్న కనీసం పట్టించుకోకపోవడం అనుమానాలు తవతీస్తున్నాయి నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆక్రమించుకోవడంలో ఇదేనా ప్రభుత్వం వైఖరి అనే విధంగా గ్రామాలలో ప్రజలు చెప్పుకుంటున్నారు పై అధికారులు విచారణ చేపట్టి మా ఇళ్ల స్థలాలు మాకు ఇప్పించండి కోరుకుంటున్నారు

## హౌసింగ్ కార్యాలయం పై మందు బాటిల్ విసిరేసిన గుర్తుతెలియని వ్యక్తి



పొదలకూరు పట్టణంలోని రాంనగర్ గేట్ సెంటర్ నందు హౌసింగ్ కార్యాలయం లోపలికి మందు బాటలు విసిరేసిన గుర్తు తెలియని వ్యక్తి గత కొన్ని రోజులుగా కార్యాలయం లోపల ముందు ఆకతాయిలు చీకటి పడిన ప్రతిరోజు ముందు తాగిన బాటిలు హౌసింగ్ కార్యాలయం లోపల పడవేయడం ప్రతిరోజు జరుగుతూనే ఉంది హౌసింగ్ కార్యాలయం పక్కన మెకానిక్ షాపులు ఉన్నాయి ఆ షాపులో పనిచేసే వాళ్ళు తాగుతున్నారని అనుమానాలు చుట్టుపక్కల వారు చెప్పుకుంటున్నారు పొదలకూరు పోలీసు వారు గమనించి ఆకతాయిలకు తగు బుద్ధి చెప్పాలని అక్కడ ప్రజలు కోరుకుంటున్నారు

## యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన ప్రధాన లక్ష్యం..!

**-రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ**



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పన తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని సంతపేటలో మంత్రి పర్యటించారు. సంతపేట మార్కెట్, పినాకిని పార్క్ లోని సచివాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం తమదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకునేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. నెల్లూరు షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయడం, నెలాఖరుకల్లా మీవీజు క్లస్టర్ పూర్తి చేయడం, అలాగే 10,060 పోస్టులతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా స్థానిక యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సంతపేట సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రజా సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోనే ఆదేశాలు జారీ చేశారు. అలాగే గొల్లవీధిలో ముస్లిం సోదరులతో ఆత్మీయంగా కలుసుకుని, చిన్నారులతో ముచ్చటిస్తూ పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. నెల్లూరులో పొగతోట సహా 15 కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల పనులను ముమ్మరం చేస్తున్నామని, ఎన్నికల హామీల కంటే రెట్టింపు స్థాయిలో అభివృద్ధి చేస్తూ నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి వెంట మేయర్ సుజాత, కమిషనర్ నందన్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ అధికారులు ఉన్నారు..

## ఉద్యోగాల కల్పన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంతోనే సాధ్యం



మంత్రి నారా లోకేష్ ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేశారు ఉగాది కానుకుగా లోకేష్ విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ పై క్యాంప్ కార్యాలయం నందు ప్రెస్ మీట్ నిర్వహించిన - శాసన సభ్యులు, పాశిం సునీల్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా... ఉద్యోగాల కల్పన జరగాలన్నా...అది ఒక ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని అన్నారు. ఇది రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉగాది సందర్భంగా ఇచ్చిన కానుకగా ఆమె అభివర్ణించారు. ఎన్నికల ముందు పాదయాత్ర చేస్తున్న సమయంలోనే నారా లోకేష్ గారు నిరుద్యోగుల సమస్యల గురించి తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి వచ్చాక ఒక ప్రణాళికాబద్ధంగా ఉద్యోగాలు కల్పన జరుగుతోందన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాల్ని ప్రాధాన్యతల వారిగా భర్తీ చేస్తున్నారని అన్నారు. అలాగే దేశ విదేశాల్లో పర్యటిస్తూ పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నారన్నారు. దీని వలన ఈ 20 నెలల్లో 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందన్నారు. వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వివిధ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేసిందని గుర్తు చేశారు. ఇప్పుడు మరోసారి డీఎస్సీని, జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం 3,000 ఖాళీలను కేటాయించిందన్నారు. ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. పరిపాలనా విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,000 పోలీస్ కానిస్టేబుల్ పోస్ట్ లు ప్రకటించారు ఇందులో కూడా ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకతతో నియామకాలు చేపడుతుందన్నారు. అభ్యర్థులకు ఎటువంటి గందరగోళం లేకుండా మంత్రి నారా లోకేష్ గారు చర్యలు తీసుకుంటున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో యువతకు ఒక నమ్మకం ఏర్పడిందని... చదువుకున్న ప్రతి ఒక్కరికి ఉద్యోగ ఉపాధి అవకాశాలుంటాయన్న భరోసా ముఖ్యమంత్రి చంద్రబాబు గారు మంత్రి నారా లోకేష్ గారు కల్పిస్తున్నారని అన్నారు.

## అనుబంధ రంగాలలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం

**నెల్లూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** దగదర్తి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ,నెల్లూరు వారి ఆధ్వర్యంలో వ్యవసాయ మరియు అనుబంధ రంగాలలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలలో ఇప్పటివరకు మండలంలో వివిధ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని మరియు ఆయా కార్యక్రమాల ద్వారా రైతులకు నూతన సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగిందని, అదేవిధంగా వ్యవసాయ రంగంలో ఎప్పటికప్పుడు వచ్చే కొత్త మార్పులను మరియు సాంకేతికతలను పుచ్చుకోవడం ద్వారా అధిక దిగుబడులను పొంద గలమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వరి మరియు వేరుశనగ పంటలలో వివిధ రకాల



యాజమాన్య పద్ధతులను వివరించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న రైతులకు ధ్రువపత్రాలు అందజేయడం మరియు భోజనం వసతి కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెంచల రాజు, ఏఈఓ, విష్ణువర్ధ న్ రెడ్డి, మాధవ సుధీర్, శ్రీజ, లు మరియు రైతులు పాల్గొన్నారు.

## అధ్యాత్మిక సంస్కృతి

జీవితాన్ని అధ్యాత్మిక కోణంలో చూస్తే
మన అస్థిత్వపు ప్రధాన ఉద్దేశం ఉన్న
చైతన్యాన్ని విశదమౌతుంది
మనిషి యొక్క అంతరంగ పరిణతినే
ఆధ్యాత్మిక ప్రగతని పరిగణించవచ్చు
మనిషిలో వివిధ భాగాలలో స్థితమై
ఉన్న రకరకాల శక్తి సామర్థ్యలను
పూర్తి స్థాయిలో సమీకరించుకోవడం
అధ్యాత్మిక ప్రగతికి అవసరం.

అంతః చైతన్యం పూర్తిగా పరిణామం
చెంది మరింత ఉన్నత స్థితికి చేరాలి
ఆధ్యాత్మిక జీవనానికి ధ్యానం
అనేది ఎంతో మేలు చేస్తుంది
అన్ని దిశల్లోను అజ్ఞానం
అసంపూర్ణ అవగాహన వంటి
అంధకార స్థితి నుండి ఉన్నతమైన
ఆత్మ చైతన్య స్థితులకు చేరేది ధ్యానం.


ధ్యానం సామాజిక పరమైన
అన్ని బాధ్యతలను ప్రశాంతచిత్తంతో
సముచిత నిర్ణయాలతో
అత్యంత సమర్థవంతంగా
నిర్వర్తించడంలో సహాయపడుతుంది
మనిషి ఒక నూతనమైన
వ్యక్తిత్వాన్ని పొందేలా చేసి
వివేకవంతుడిగా తీర్చిదిద్దుతుంది.

శ్రద్ధతో కూడిన ప్రార్ధన
మనవ్యక్తిగత విశ్వసనీయతను
సామాజిక సమగ్రతను కాపాడి
మనిషిలోని అత్యుత్తమ సంస్కృతిని
నాగరికతను బయటకు తీసేందుకు
ప్రార్ధన ఎంతో తోడ్పడుతుంది
మనస్సును పవిత్రం చేసేందుకు
మనిషికి ప్రార్ధనే సరైన మార్గం.



**రచన : కె.మురళీమోహన్ రాజు**
**నెల్లూరు.**
**చరవాణి : 9866179385**

## సైదాపురం ఎస్ఐ నిర్లక్ష్యానికి ఓవివాహిత పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం



**సైదాపురం - విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్ ,మార్చి 20 :** తన కుటుంబానికి జీవనాధారమైన గేదెను చంపారని ఫిర్యాదు చేయడానికి వెళితే, ఎస్ఐ క్రాంతి కుమార్ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితురాలు దొంగల మహేశ్వరి మనస్థాపానికి గురై,ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సైదాపురం మండలం రాగన రామాపురంలో శుక్రవారం చోటుచేసుకుంది. దొంగల మహేశ్వరి భర్త అన్న దొంగల శ్రీనివాసరావు, ఆమెకు చెందిన గేదెను కొట్టి చంపడంతో అతనిని చేసేదేమీ లేక పోలీసులకు ఫిర్యాదు చేయడానికి వెళితే సైదాపురం ఎస్ఐ క్రాంతి కుమార్ ప్రస్తుతం మేము బిజీగా ఉన్నాం రెండు రోజులు తర్వాత వస్తాం చచ్చిపోయిన బర్రి ఎక్కడికి పోదులే అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో మనస్థాపానికి గురైన దొంగల మహేశ్వరి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.సైదాపురం మండలంలో ఎటువంటి సమస్యలకైనా పోలీస్ స్టేషన్ కు వెళ్ళవలసి వస్తే అక్కడ పేదలకు న్యాయం జరగడం లేదంటూ ఎస్ఐ క్రాంతి కుమార్ పై ఇప్పటికే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి, ఈ నేపథ్యంలో ఈరోజు జరిగిన ఘటన పై, ఆమె కుటుంభ సభ్యులు, ఎస్ఐ క్రాంతి కుమార్ నిర్లక్ష్య నిర్వాకం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## రంజాన్ శుభాకాంక్షలు : షేక్ బాషా,

అధికార ప్రతినిధి బీసీ సంక్షేమ సంఘం. ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి షేక్ బాషా తెలిపారు. నెల్లూరు నగరం బాలాజీ నగర్ మసీదు నందు శుక్రవారం ఇఫ్తార్ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ప్రార్ధన నిర్వహించారు తదుపరి స్థానిక తెలుగుదేశం నాయకులు రవీంద్రబాబు అందించిన180 అరకేజీ ఖర్జూరపు పండ్ల ప్యాకెట్లను పంపిణీ నిర్వహించారు. షేక్ ఖాజావలి, బషీర్, రహమత్ బిర్యానీ ఇస్మాయిల్, షబ్బీర్, గౌస్,షఫీ పలువురు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



## పోకూరు - రాళ్లపాడు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

- **3 కోట్లతో జరగనున్న పనులు**
- **పోకూరులో ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం పలికిన ప్రజలు**
- **పనులు నాణ్యతతో, త్వరగా పూర్తిచేయాలని సూచించిన నాగేశ్వరరావు**

**కందుకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** వలేటివారిపాలెం మండలం పోకూరు నుంచి శాఖవరం, ఎ=కోట, చీమలపెంట మీదుగా రాళ్లపాడు వరకు రోడ్డును అభివృద్ధి చేసే పనులకు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పోకూరులో శంకుస్థాపన చేశారు. రోడ్లు భవనాల శాఖ నుంచి ఎండిఆర్ గ్రాంట్ ద్వారా మంజూరైన 3 కోట్ల రూపాయలతో 18 కిలోమీటర్ల పొడవున రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ముందుగా పోకూరు గ్రామంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు కి అపూర్వ స్వాగతం లభించింది. టిడిపి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యే పై పూలవర్షం కురిపిస్తూ మేళతాళాలతో శిలాఫలకం వద్దకు తీసుకెళ్లారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ పనులు నాణ్యతతో త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రస్తుతం రోడ్డుకు రెండు వైపులా ఉన్న డ్రైనేజీ కాలువలకు సమానంగా కొత్తరోడ్డును నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్, జెఈ భరత్ రెడ్డి, ఎంపీడీవో శంకర్రావు, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిన వెంకటేశ్వర్లు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి, సోమినేని తిరుమలరావు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, ఘట్టమనేని చెంచురామయ్య, నల్లమోతు రవీంద్ర, గురజాల బెంజిమెన్, నాగభూషణం, ఘట్టమనేని సీతయ్య, అత్తోట వెంకటేశ్వర్లు, ఆలూరి రాములు, పెగడ శ్రీనివాసులు, వంకాయలపాటి మాల్యాద్రి, చెరువుపల్లి సాంబయ్య, మండలంలోని అన్ని గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# వెల్లివిరిసిన అభిమానం..!

-గూడూరులో అంగరంగ వైభవంగా  యునైటెడ్ ఫోరం జాతీయ అధ్యక్షులు దేగ రవి రాఘవేంద్ర జన్మదిన వేడుకలు
-భారీ క్రేన్ తో గజమాల వేసి ఘన స్వాగతం పలికిన అభిమానులు
-పట్టణంలో భారీ ఎత్తున బాణా సంచా
-బనిగిసాహెబ్ పేట, అరుంధతీయ వాడల్లో పండుగ వాతావరణం
-భారీ అన్నదానం... ఏరియా ఆస్పత్రి రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ
-ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం అలుపెరుగని పోరాటం చేస్తాం : దేగ రవి రాఘవేంద్ర వెల్లడి





**గూడూరు విజ్ఞాన పత్రిక :** ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీస్ యునైటెడ్ ఫోరమ్ జాతీయ అధ్యక్షులు దేగ రవి రాఘవేంద్ర జన్మదిన వేడుకలను శుక్రవారం గూడూరులో ఘనంగా నిర్వహించారు. గూడూరు పట్టణంలోని బనిగి సాహెబ్ పేట సెంటర్లో క్రేన్ సహాయంతో అభిమానులు భారీ గజమాల వేసి దేగ రవి రాఘవేంద్రకు ఘన స్వాగతం పలికారు. ఆనంద ఉత్సాహంతో అభిమానులు భాణాసంచా పేల్చారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అరుంధతి పాలెం లోని మహిళలు ఆయనకే మంగళ హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. అభిమానులు ఆనందోత్సాహంతో భారీగా భాణసంచా పేల్చి, అరుంధతి పాలెం లోని శ్రీ మాతా పరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పూజలు నిర్వహించారు. అభిమానుల మధ్య కేక్ కటింగ్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలోని మెటర్నిటీ వార్డు రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆల్ యునైటెడ్ ఫోరమ్ జాతీయ అధ్యక్షులు దేగ రవి రాఘవేంద్ర మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలలో బడుగు, బలహీన వర్గాల అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. జన్మదిన వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించిన ఫోరమ్ సభ్యులు, మహిళలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. జన్మదిన వేడుకల్లో వివిధ జిల్లాల నుండి హాజరైన ఫోరమ్ రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు పేరు పేరున రవి రాఘవేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పందిటి సుబ్బయ్య, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, డిఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రభుదాస్, ఎంఈఎఫ్ నాయకులు తోళ్ల నారాయణ, చింతకుంట మస్తానయ్య, పార్ధసారథి, గుంటూరు దయాసాగర్, యునైటెడ్ ఫోరం విద్యార్థి విభాగం అధ్యక్షులు ఉద్దాల మణి, అయ్యప్ప మురళి తదితరులు పాల్గొన్నారు.

## జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను పరిశీలించిన మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్ కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి

**బోగోలు : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్** ఫిషింగ్ హార్బర్ భూములలో నారా లోకేష్ ఆవిష్కరించిన సాగర్ డిఫెన్స్ కంపినీ శిలాఫలకంను పరిశీలించిన నేతలు.. సాగర్ డిఫెన్స్ కంపెనీకి ఫిషింగ్ హార్బర్ భూములలో 30 ఎకరాలు కేటాయించడాన్ని తప్పుపట్టిన మాజీ మంత్రి కాకాని, మాజీ ఎమ్మెల్యేలు ప్రతాప్ కుమార్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి మత్స్యకారులకు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ఆస్తి ఫిషింగ్ హార్బర్ జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ పరిశీలించేందుకు వస్తుంటే పోలీసులు అటకాయించటం ఎంతవరకు సమంజసం రాష్ట్రంలో మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని జగన్మోహన్ రెడ్డి ఫిషింగ్ హార్బర్లను నిర్మిస్తే మీరు ప్రైవేట్ కంపెనీలకు దారా దత్తం చేయడానికి చంద్రబాబు నాయుడుకి లోకేష్ కు ఏం హక్కు ఉంది. ఫిషింగ్ హార్బర్ భూముల్లో కాకుండా మీరు ఎక్కడైనా భూములు కేటాయించిన ఎవరు దానికి అభ్యంతరం చెప్పరు . చంద్రబాబు నాయుడు లోకేష్ రామాయపట్నం ,ఫిషింగ్ హార్బర్ఫిషింగ్ హార్బర్ లాంటి పోర్టులను ఎప్పటికైనా నిర్మించగలరా రాబోయే రోజుల్లో మత్స్యకారులకు అక్కడ కోల్డ్ స్టోరేజీలతో మరింత స్థలం అవసరం అవుతుంది అప్పుడు మత్స్యకారుల



పరిస్థితి ఏమిటి . మత్సకారులపై చంద్రబాబు నాయుడు కక్ష సాధింపులకు పాల్పడుతున్నట్లు ఉంది. మెడికల్ కాలేజీల్ని ప్రైయివేట్ పరం చేస్తున్నట్లు పోర్టుల్ని, హార్బర్లను కూడా ప్రైవేటు సంస్థలకు ధారా దత్తం చేస్తున్నారు. మంత్రి కొల్లు రవీంద్ర మత్స్యకారుడు కాబట్టి కలెక్టర్ పక్కన కూర్చోపెట్టి మాట్లాడించటానికి కొంచమైనా తెలివి ఉండాలి. చంద్రబాబు నాయుడు అబద్ధాలకు , అవినీతికి ,అక్రమాలకు బ్రాండ్ అంబాసిడర్.. ఫిషింగ్ హార్బర్ లో జగన్మోహన్ రెడ్డి శిలాఫలకం పగలు కొట్టి సాగర్ డిఫెన్స్ శిలాఫలకం వేసి ఇదంతా మేము నిర్మించామని చెప్పుకోవటం సిగ్గు చేటు

## .ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కావ్య

- **దాతలు కృష్ణ కుమార్ దంపతులు అరుదైన వ్యక్తులు**
- **కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి వెల్లడి**

**బోగోలు : విజ్ఞాన్ దినపత్రిక న్యూస్ :** నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. బోగోలు మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో దాతలు బచ్చు కృష్ణకుమార్ -- సంధ్య దంపతుల సహకారంతో డాక్టర్ బచ్చు అమర నూతన ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించగా, కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేసి, శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఈ నూతన వైద్యశాల కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. మరి కొన్ని సేవలు ఈ ఆరోగ్యం కేంద్రంలో ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. హైవే కి పక్కనే ఈ హాస్పిటల్ ఉండటం వలన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని తెలిపారు. దాతలు బచ్చు కృష్ణకుమార్ -- సంధ్య దంపతుల సేవాభావాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రశంసించారు. సమాజానికి సేవ చేయాలనే తపనతో ముందుకు రావడం ఎంతో గొప్ప విషయమని పేర్కొన్నారు. వ్యక్తి జీవితంలో ప్రొఫెషనల్, కుటుంబ, సామాజిక మరియు ఆధ్యాత్మిక లక్ష్యాలలో సమతౌల్యం సాధించడం ద్వారా సమాజంలో ఆదర్శంగా నిలవవచ్చున్నారు. బచ్చు



కృష్ణకుమార్ దంపతులు ఈ నాలుగు రంగాల్లోనూ విజయాన్ని సాధించిన అరుదైన వ్యక్తులని కొనియాడారు. ఇక బోగోలు మండలం ఒకప్పుడు జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన ప్రాంతమని, ప్రస్తుతం వెనుకబడిన పరిస్థితి నుంచి బయటపడేందుకు ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలు ఎంతో అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీద జ్యోతి, టీడీపీ బోగోలు మండల అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి లేళ్లపల్లి సుధీర్, చిలకపాటి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు, దాతలు బచ్చు కృష్ణ కుమార్, సంధ్య, శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవో అరవ రాధాకృష్ణ, కుంచాల తిరుమలేష్, లక్కాకుల మాధవరావు, జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు

**విజ్ఞాన్ పత్రిక మణికుమార్ కారంపూడి మార్చి :21)** రంజాన్ అంటే క్షమాపణ కోరేందుకు మరో అవకాశం ఈ అవకాశాన్ని సోదరులంతా సద్వినియోగం చేసుకోవాలి రంజాన్ శుభాకాంక్షలు. అల్లా అనుగ్రహం మీపై, మీ కుటుంబ సభ్యులపై ఎప్పుడూ ఉండాలని కోరుకుంటూ. రంజాన్ శుభాకాంక్షలు . ఈ పవిత్ర మాసంలో అల్లా మీ చింతలు తొలగించి ఆనందాన్ని ప్రసాదించాలి రంజాన్ శుభాకాంక్షలు. విధేయుతతో చేసే పనులు మంచి ప్రతిఫలాన్నిస్తాయి అల్లా ఆశీర్వాదం మీపై సదా ఉండాలని కోరుకుంటూ ప్రతి రంజాన్ నెల ఓ అద్భుత ప్రయాణం అందులో ఈద్-ఉల్-ఫితర్ అద్భుత ఘట్టం ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు. అల్లా మీకు శాంతిని, శ్రేయస్సును ప్రసాదించాలని కోరుకుంటూ ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు. జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టాన్నీ అధిగమించే శక్తిని అల్లా మీకు ప్రసాదించాలి ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు. దేవునిపై భక్తి విశ్వాసాలు ఉండేవారి కర్మానుసారం పవిత్రమైన జీవితం అందుతుందని చెబుతోంది ఖురాన్ రంజాన్ శుభాకాంక్షలు. రంజాన్ మాస ఉపవాస దీక్షలు ముగించుకుని ఈద్ ఉల్ ఫితర్ వేడుక జరుపుకుంటున్న సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు. సహనం, సంతోషం, ప్రేమ, దయ కలయికే రంజాన్ మాసం మీకు , మీ కుటుంబ సభ్యులకు ఈద్-ఉల్-ఫితర్ శుభాకాంక్షలు. ఈ రంజాన్ మీ కుటుంబంలో సంతోషం నింపాలి. ఈ మహత్తరమైన రోజున మీ కుటుంబంలో సంతోషం



వెల్లివిరియాలి. రంజాన్ శుభాకాంక్షలు. ఈ పవిత్ర మాసం మీ కలలు నిజం చేయాలి, ఆశలు నెరవేర్చాలి మీకు , మీ కుటుంబ సభ్యులకు రంజాన్ ముబారక్. మీ జీవితం ఎంత కష్టంగా ఉన్నా.. రంజాన్ దాన్ని మార్చగలదని విశ్వశించండి మీకు మీ కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు. ఈ రంజాన్ మీ జీవితంలో కొత్త వెలుగులు నింపాలి మీకు మీ కుటుంబ సభ్యులకు రంజాన్ శుభాకాంక్షలు. ఉపవాసంతో మనిషిని బాధించడం ఇస్లాం ఉద్దేశం కాదు.. పేదవాడి ఆకలి బాధ తెలుసుకోవడమే అసలు ఉద్దేశం ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు. ఈ రంజాన్ మీ జీవితంలో కొత్త వెలుగులు నింపాలి సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు. ఆ చంద్ర కాంతి మీపై ప్రసరించాలి అల్లా దీవెనతో మీ కోర్కెలు ఫలించాలి ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు. ధార్మిక చింతన, క్రమ శిక్షణల కలయిక రంజాన్ మాసం ఈద్ ఉల్ ఫితర్ శుభాకాంక్షలు. ముస్లింలు పండుగ శుభాకాంక్షలు తెలియజేసేందుకు ఈద్ ముబారక్ అని పలకరిస్తారు.. ఇంకా.. ఖైర్ ముబారక్, అల్లాహ్ యెబరేక్ ఫీక్ అని కూడా చెప్పవచ్చు.

## కొండయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపిన బుర్రా

**కందుకూరు విజ్ఞాన్ దినపత్రిక రిపోర్టర్** కందుకూరు టౌన్ ఆది ఆంధ్ర కాలనికి చెందిన వైస్సార్సీపీ సీనియర్ నాయకుడు, వార్డ్ క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు కుడుముల మాలకొండయ్య అనారోగ్యం కారణంగా మరణించిన విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి ఆయన పార్థివ దేహానికి ఘనంగా నివాళులు అర్పించిన మాజీ శాసనసభ్యులు, కందుకూరు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జ్ బుర్రా మధుసూదన్ యాదవ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండయ్య విడిచి వెళ్లిన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని కోరుకుంటున్నాను అని అన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ తోకల కొండయ్య, రాష్ట్ర బూత్ సహాయ కార్యదర్శి గణేశం గంగిరెడ్డి, నియోజకవర్గ రైతు అధ్యక్షులు నల్లమోతుల చంద్రమౌళి, క్రిస్టియన్ మైనారిటీ నియోజకవర్గ అధ్యక్షులు ఉచ్చులూరి రవీంద్ర ,అప్పనబోయిన రాజేష్, కందుకూరు పట్టణ ఎస్సీ సెల్ జనరల్ సెక్రెటరీ జంగిలి సుబ్బారావు,వార్డు అధ్యక్షులు గౌడపేరు. క్రాంతి



కుమార్, సీనియర్ నాయకులు వంకాయలపాటి మోషే, రేణమాల శింగయ్య, సూరపోగు అఖిల్,అత్యాల సురేష్, అత్యాల కిషోర్, తాటిపర్తి కోటేశ్వరరావు వార్డు కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

## వింజమూరు మండలంలో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమగ్ర పరిశీలన చేపట్టిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ..!

వింజమూరు మండల కేంద్రంలో త్వరలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ స్వయంగా దగ్గరుండి సమగ్రంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంగా, ప్రజలకు ఉపయోగకరంగా, పరిపాలనా పరంగా ఆదర్శప్రాయంగా జరిగేలా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ , ఆత్మకూరు మరియు కావలి ఆర్డీవోలు, వివిధ శాఖలకు చెందిన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో కలిసి పర్యటనకు సంబంధించిన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించారు. ముఖ్యమంత్రి పాల్గొననున్న సభా ప్రాంగణం, వేదిక నిర్మాణం, ప్రజల రాకపోకల సౌకర్యం, పార్కింగ్, త్రాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే భద్రతా ఏర్పాట్లను కూడా సవివరంగా సమీక్షిస్తూ, ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అంతరాయాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ప్రతి చిన్న విషయాన్ని కూడా నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్ష



సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ , ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్ల పురోగతిని తెలుసుకుని, ఇంకా చేపట్టవలసిన పనులపై తగిన మార్గదర్శకాలు అందించారు. నిర్ణయించిన గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంతీయ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో ముఖ్యమంత్రి పర్యటన ఎంతో ప్రాధాన్యత కలిగినదని పేర్కొంటూ, ఈ పర్యటన వింజమూరు మండలానికి మరింత అభివృద్ధి దిశగా కొత్త ఊపునిస్తుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పర్యటన విజయవంతం కావడానికి అధికారులు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### పాములపాడు లోని ఏపీ మోడల్ స్కూల్లో ఫస్ట్ ఇయర్ ఇంటర్ ప్రవేశాల కొరకు దరఖాస్తులు

**పాములపాడు, మండల రిపోర్టర్** పాములపాడు మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగరవీంద్ర మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్ ఇయర్లో ఎంపీసీ బైపిసి సిఇసి ఎం ఇ సి గ్రూపులలో 2026 -2027 సంవత్సరంలో ప్రతి కోర్స్ కు 40 సీట్ల చొప్పున 160 సీట్లు కలవని ఈ సీట్ల భర్తీకి మార్చి 20వ తారీకు నుండి ఏప్రిల్ 30వ తారీకు వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి అని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ నాగ రవీంద్ర తెలిపారు ఈ స్కూలులో చక్కటి వాతావరణము విశాలమైన క్రీడా ప్రాంగణము ఉత్తమ విద్యా బోధన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన అందించబడునని ఒక ప్రకటనలో తెలిపారు మోడల్ స్కూల్ నందు నీటు మరియు ఎంసెట్ కోచింగ్ ఇవ్వబడుతుంది ఈ స్కూల్ నందు ఐఐటి సీట్లలో చాలామంది ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారని తెలిపారు



Printed by : KomalaguntaNageswararao, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Bulidings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Owned by : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Printed at : Deepakroshan Graphics, Digital & Multicolour Printers, D.No.16-256/3,Up Stair,Near Hanuman Temple, Sankaraiah Buldings, Rayaji Street, Nellore,Sri Potti Sriramulu Nellore Dist, ANDHRAPRADESH PIN NO -524001
Published at : D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.
Editor : KALIKI UDAYKUMAR REDDY D.No. Lig1- 697, Kallurupalli Housing Board Colony, Nellore- 524004, S.P.S.R. Nellore District.